కుదేలవుతున్న మట్టి పైపుల పరిశ్రమ



- ప్లాస్టిక్ పైపుల వాడకంతో మందగించిన అమ్మకాలు
- జిల్లాలో అత్యధిక పరిశ్రమలు
- మూసివేతలో పలు పరిశ్రమలు
- రోడ్డున పడనున్న కార్మికులు

ఏసీసీ, ఏప్రిల్ 21: మట్టి పైపుల పరిశ్రమ మసక బారుతోంది. ఆధునిక కాలంలో గృహ నిర్మాణంలో పెనుమార్పులు చోటు చేసుకున్నాయి. త్వరిత గతిన పనులు పూర్తయ్యేలా నిర్మాణంలో సరికొత్త వస్తు సామగ్రిని ఉపయోగిస్తున్నారు. ప్రభుత్వం పట్టణాలు, గ్రామాల్లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ కోసం చేపట్టే పనుల్లో గతంలో మట్టి పైపులను వాడేవారు. ప్రస్తుతం గృహ నిర్మాణం, అపార్టుమెంట్‌లు, షాపింగ్ కాంప్లెక్స్‌లు, లే అవుట్ వెంచర్ డ్రైనేజీ పనుల్లో మట్టి పైపులకు బదులుగా ప్లాస్టిక్ పైపులను వినియోగిస్తున్నారు. దీంతో మట్టి పైపుల పరిశ్రమ కుదేలవుతోంది.

జిల్లాలో 26 మట్టి పరిశ్రమలు

మంచిర్యాల జిల్లాలో 26 మట్టి పైపుల పరిశ్రమలు ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 36 పరిశ్రమలు ఉంటే అందులో జిల్లాలోనే అధికంగా ఉన్నాయి. పైపులు తయారు చేయడానికి ఉపయోగించే నాణ్యమైన మట్టి జిల్లా చుట్టు పక్కల ప్రాంతాల్లో లభిస్తోంది. పైపులను కాల్చడానికి వాడే బొగ్గు అందుబాటులో ఉంది.

పెరిగిన ప్లాస్టిక్ పైపుల వాడకం

ప్లాస్టిక్ పైపుల వాడకంతో మట్టి పైపుల అమ్మకాలు మందగించాయి. మట్టి పైపులతో పోల్చితే ప్లాస్టిక్ పైపులను భూమిలో వేయడం (లేయింగ్) సులువు. ప్లాస్టిక్ పైపులు మట్టి పైపుల కంటే పొడవుగా ఉండడంతో పని త్వరగా పూర్తవుతుంది. బరువు కూడా తక్కువగా ఉండడంతో ఫంబర్‌లకు సులువుగా అమర్చవచ్చు. మట్టి పైపులతో పోల్చితే ప్లాస్టిక్ పైపుల మన్నిక కాలం తక్కువగా ఉంటుంది. మట్టి పైపులు భూమిలో వేశాక వంద సంవత్సరాలు అయినా చెక్కు చెదరవు. ప్లాస్టిక్ పైపులకు వెచ్చించే ధరలో సగం ధరకే మట్టి పైపులు వస్తాయి. మట్టి పైపులను ఎలుకలు, పంది కొక్కులు, చెదలు మరే ఇతర సూక్ష్మ క్రీములు కూడా పాడుచేయలేవు. డ్రైనేజీ నీటిలో ఉం డే క్షారాలు కూడా మట్టి పైపులను పాడు చేయలేవు.

పర్యావరణానికి మేలు

మట్టి పైపుల తయారీ విధానం పూర్తిగా పర్యావరణహితంగా ఉంటుంది. బంకమట్టిని మెత్తగా గ్రైండింగ్ చేసి నీటితో కలిపి పైపులను తయారు చేస్తారు. పైపులను ఆరబెట్టిన తర్వాత కిలన్‌లో 1050 డిగ్రీల సెంటిగ్రేడ్ వేడిలో కాలుస్తారు. దాని వల్ల మట్టి పైపుల్లో రసాయన చర్య జరిగి దృఢంగా తయారవుతాయి. ఈ పైపులను డ్రైనేజీ నీరు, ఇతర వ్యర్థాలను పంపేందుకు వాడుతారు. పైపులను భూమిలో వేశాక రంధ్రాలు పడడం, పగుళ్లు ఏర్పడడం జరగదు.

ఉత్పత్తి నిలిపివేత

జనవరి వరకు జిల్లాలో మట్టి పైపుల విక్రయాలు నెలకు రూ. 10 కోట్ల టర్నోవర్ నమోదు కాగా, ఫిబ్రవరి, మార్చి నెలల్లో రూ. 2 కోట్ల అమ్మకాలు మాత్రమే జరిగాయి. ఏప్రిల్ నెలలో ఒక కోటి రూపాయల వరకు మాత్రమే అమ్మకాలు జరుగుతాయని అంచనా వేస్తున్నారు. జిల్లాలోని అన్ని పరిశ్రమల్లో పైపుల ఉత్పత్తిని నిలిపివేశారు. పాత స్టాక్‌ను మాత్రమే విక్రయిస్తున్నారు. ఉత్పత్తిని నిలిపివేయడంతో 80 శాతం మంది కార్మికులు ఇంటి బాట పట్టారు. పని చేస్తున్న కొద్దిమందికి కూడా సమయానికి జీతాలు ఇవ్వలేని స్థితిలో యాజమాన్యాలు ఉన్నాయి.

మూసివేత దిశగా పరిశ్రమలు

మట్టి పైపుల అమ్మకాలు మందగించడంతో పరిశ్రమలు మూసివేసే స్థితికి చేరుకున్నాయి. మట్టి పైపుల పరిశ్రమలన్నీ చిన్న తరహా పరిశ్రమలుగా ఎక్కువ మంది కార్మికులు తక్కువ మిషనరీతో శ్రమ శక్తిపై ఆధారపడి నడుస్తున్నాయి. జిల్లాలో ఈ పరిశ్రమలపై ఆధారపడి ప్రత్యక్షంగా 4 వేల మంది, పైపుల లోడింగ్, అన్‌లోడింగ్, పైపులను ఫ్యాక్టరీ నుంచి వినియోగదారులకు చేరవేయడం, ముడి సరుకులను ఫ్యాక్టరీకి రవాణా పనుల్లో పరోక్షంగా 15 వేల మంది వరకు ఉపాధి పొందుతున్నారు. ప్రభుత్వానికి విద్యుత్ బిల్లులు, పన్నుల రూపేణా ఆదాయం సమకూరుతుంది.

ప్రభుత్వం ఆదుకోవాలి

పి.వరప్రసాదరావు, మట్టి పైపుల ఉత్పత్తిదారుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు

మట్టి పైపుల పరిశ్రమను ప్రభుత్వం ఆదుకోవాలి. పర్యావరణానికి ఎలాంటి హానీ చేయని మట్టి పైపులను ఉపయోగించేలా ఆదేశాలు జారీచేయాలి. జీహెచ్ఎంసీ, కార్పొరేషన్‌లు, మున్సిపాలిటీలు, గ్రామపంచా యతీలు, అనుమతి పొందిన లే అవుట్ వెంచర్లలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు మట్టి పైపులను వినియోగించాలి. చిన్న తరహా పరిశ్రమ అయిన మట్టి పైపుల పరిశ్రమలు మూతపడకుండా ప్రభుత్వం కాపాడాలి.



కుశ్నపల్లికి వచ్చిన అఘోరా



అమ్మవారికి హారతి ఇస్తున్న అఘోరా

నెన్నెల, ఏప్రిల్ 21: శరీరమంతా బూడిద, పొడవైన జుట్టు, మెడ నిండా రుద్రాక్ష దండలతో నగ్నంగా సంచరించే అఘోరా కుశ్నపల్లికి వచ్చాడు. గ్రామంలో నిర్మించిన రేణుక ఎల్లమ్మ ఆలయంలో ఆదివారం విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్నాడు. చెన్నై నుంచి ప్రత్యేక వాహనంలో కుశ్నపల్లికి చేరుకున్న అఘోరా గుడిలో ప్రజలతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుశ్నపల్లికి చెందిన తాను చిన్నప్పుడే హిమాలయాలకు వెళ్లి అఘోరాగా మారిపోయానని చెప్పాడు. గ్రామంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఉందనే సమాచారంతో వచ్చానని తెలిపాడు. తనను విష్ణుబ్రహ్మ అఘోర నాగసాధు అర్ధనారీశ్వర స్వామిగా పిలుస్తారని చెప్పాడు. ఎల్లమ్మ గుడి అభివృద్ధికి రూ.30 వేల విరాళం అందజేశాడు. అఘోరాను చూసేందుకు ప్రజలు తరలివచ్చారు.

కళాశాలపై చర్యలు తీసుకోవాలి

మందమర్రిరూరల్, ఏప్రిల్ 21: కార్మెల్ కళాశాలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి జన సమితి జిల్లా అధ్యక్షుడు బచ్చలి ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పదవ తరగతి పరీక్ష ఫలితాలు వెలువడకముందే కళాశాల నిర్వాహకులు అడ్మిషన్‌లు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఐఐటీ, నీట్ కోచింగ్ అంటూ ప్రజలను మభ్య పెడుతున్నారని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు స్పందించి కళాశాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 21: నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ డిజైనింగ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సులకు దరఖాస్తులు చేసుకోవాలని సంస్థ డైరెక్టర్ రాము యాదవ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు మే 16వ దరఖాస్తులు చేసుకోవచ్చని, 19వ తేదీన స్కాలర్‌షిప్ టెస్ట్ జరుగుతుందని తెలిపారు. ఈ కోర్సుల్లో చేరడానికి టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యార్హతలు కలిగినవారు దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. వివరాలకు 9030610033 నెంబరులో సంప్రదించాలని తెలిపారు.

ప్రజా సంఘాల బలోపేతానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న వెంకటేశ్వర్‌రావు

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 21: ప్రజా ఉద్యమాల నిర్మాణానికి పార్టీని, ప్రజా సంఘాలను సన్నద్ధ పర్చడంలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యుడు సాధినేని వెంకటేశ్వర్‌రావు పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కమ్యూనిస్టు విలువలను పెంపొందించడంలో ప్రతీ ఒక్కరు శక్తి వంచన లేకుండా కృషి చేయాలని, కొందరు వ్యక్తుల కారణంగా పార్టీ నిర్మాణ పద్ధతులు ఏకపక్ష వైఖరితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. జిల్లాలో సుదీర్ఘకాలం విప్లవోద్యమంలో పని చేస్తున్న నాయకులను కలుపుకుని పని చేయాలన్నారు. పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్న ఏ ఒక్కరిని ఉపేక్షించేది లేదని క్రమశిక్షణ చర్యలు తీసుకొంటామన్నారు. ఇఫ్టూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ పద్ధతులను పాటించాలని, లేదంటే క్రమశిక్షణ చర్యలకు గురి కాక తప్పదన్నారు. మేకల రామ న్న, రమేష్, సారయ్య, కలీల్, రాజేశ్వర్‌రావు, సురేందర్, షాహిన్, ప్రభంజన్ పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనారాయణ స్వామి కల్యాణం



మ్యాదరిపేట ఆలయంలో కల్యాణం జరిపిస్తున్న పండితులు

దండేపల్లి, ఏప్రిల్ 21: మ్యాదరిపేటలో లక్ష్మీనారాయణస్వామి కల్యాణాన్ని శంకర్ శర్మ వేదమంత్రోచ్చారణ మధ్య ఆదివారం కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు లింగాల శ్రీమతి సమక్షంతో ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలను నిర్వహించారు. స్వామి వారి కల్యాణాన్ని చూడ ముచ్చటగా నిర్వహించి స్వామి వారికి ముత్యాల తలంబ్రాలు పోశారు. అనంతరం పలువురు భక్తులు భక్తిశ్రద్ధలతో స్వామి కల్యాణం తిలకించి, ప్రత్యేక పూజలతో మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదానం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

ఏసీసీ, ఏప్రిల్ 21 : మంచిర్యాల పట్టణంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో లక్సెట్టిపేట మండలం వెంకట్రావుపేటకు చెందిన బత్తుల సత్తయ్య అనే పాల వ్యాపారి తీవ్ర గాయాలపాలయ్యాడు. వెంకట్రావుపేట నుంచి రోజు ద్విచక్ర వాహనంపై పాల డబ్బాలతో మంచిర్యాలకు వచ్చి పాలు అమ్మి తిరిగి వెళ్లేవాడు. ఆదివారం కూడా మంచిర్యాలకు వచ్చి పాలు అమ్మి తిరిగి వెళ్లేందుకు లక్ష్మీ థియేటర్ చౌరస్తా వద్ద బైపాస్ రోడ్డు ఎక్కుతుండగా ఎదురుగా వస్తున్న లారీ (ఏపీ28టీటీ7899) ఢీకొనడంతో కుడి కాలు నుజ్జునుజ్జయ్యింది. స్థానికులు గమనించి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించగా ఆసుపత్రికి తరలించారు. బంధువు దామెర మల్లేష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు.

కాకా కుటుంబం ప్రజా సేవకే అంకితం

పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి వంశీకృష్ణ

మందమర్రిటౌన్, ఏప్రిల్ 21: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, దివంగత కాకా వెంకటస్వామి కుటుంబం ప్రజా సేవకే అంకితమని, తాత స్ఫూర్తితోనే రాజకీయాల్లోకి వచ్చానని పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ వివేక్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ పెద్దపల్లి పార్లమెంట్‌కు రెండు దశాబ్దాలపాటు వెంకటస్వామి సేవలందించారన్నారు. తండ్రి చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి, పెద్దనాన్న బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్‌ల ప్రోత్సాహంతో ముందుకు వెళ్తున్నానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ తనపై నమ్మకంతో టికెట్ ఇచ్చిం దని, నిస్వార్థంగా ప్రజలకు సేవలందిస్తానని తెలిపారు. తాను ప్రచారానికి ఎక్కడకు వెళ్లినా ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందన్నారు. పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యేలు తనకు సూచనలు, సలహాలు ఇస్తూ ముందుకు నడిపిస్తున్నారన్నారు. పార్లమెంట్ అభివృద్ధికి ప్రణాళికలతో ముందుకు వెళ్తానని, ప్రజలు తనకు అవకాశం ఇచ్చి గెలిపించాలని కోరారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి నిరంతరం పాటు పడుతుందన్నారు. బీఆర్ ఎస్, బీజేపీలో రెండు ఒక్కటేనని, ఈ పార్టీలను నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరని పేర్కొన్నారు. పది సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో ఆర్థికంగా నష్టపోవడంతోపాటు ఖజానా ఖాళీ అయ్యిందన్నారు. వంద రోజుల్లో తమ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను జీర్ణించుకోలేక పోతున్నారన్నారు. కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి రావడం ఖాయమని తెలిపారు.

బాక్సింగ్ పోటీలకు క్రీడాకారులు ఎంపిక



ఎంపికైన బాక్సింగ్ క్రీడాకారులతో నిర్వాహకులు

నస్పూర్, ఏప్రిల్ 21: జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లాస్థాయి యూత్ మెన్, ఉమెన్ బాక్సింగ్ ఎంపిక పోటీలు కుమార్ గన్నర్ అకాడమీలో జరిగాయి. ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారు. అకాడమీ ఫౌండర్, రిటైర్డ్ ఆర్మీ ఆఫీసర్ కుమార్ పోటీలను ప్రారంభించారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 26 నుంచి 28 వరకు హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. కుమార్ మాట్లాడుతూ క్రీడల పట్ల యువత ఆసక్తి చూపాలన్నారు. బాక్సింగ్ క్రీడలో జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిల్లో ప్రతిభ కనబరచాలన్నారు. బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పాదం రవీందర్ మాట్లాడుతూ త్వరలో వేసవి శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సీనియర్ క్రీడాకారులు కొట్టె దేవేందర్, కోచ్ రాజేశ్, మహేష్, రాజేశ్, జగత్ సాయి, కుమార్ గన్నర్ అకాడమీ ఇన్‌చార్జి రమేష్ పాల్గొన్నారు.

గ్రంథాలయానికి కూలర్ అందజేత



గ్రంథాలయానికి కూలర్ అందజేస్తున్న కపిల్

కోటపల్లి, ఏప్రిల్ 21: మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయానికి ఆదివారం మండల కేంద్రానికి చెందిన పనకంటి కపిల్ అనే యువకుడు కూలర్ అందజేశారు. పోటీ పరీక్షల నేపథ్యంలో వేసవి దృష్ట్యా పాఠకుల అభ్యర్థన మేరకు కూలర్ అందించినట్లు కపిల్ పేర్కొన్నారు. పాఠకులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు గ్రంథాలయానికి కూలర్ అందజేసిన కపిల్‌ను అభినందించారు. మాజీ ఎంపీటీసీ రాగం స్వామి, నాయకులు రాళ్లబండి శ్యాంసుందర్, మధు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో మత ప్రచారం చేయడం దుర్మార్గం

బెల్లంపల్లి, ఏప్రిల్ 21 : కుల, మతాలకు అతీతంగా కళాశాల నిర్వహణ చేపట్టాల్సిన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మత ప్రచారాన్ని చేపట్టడం దుర్మార్గమని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు రెడ్డి చరణ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బెల్లంపల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మార్చి 7న నిర్వహించిన కార్యక్రమంలో కల్వరీ చర్చి నిర్వాహకురాలు క్రిస్టియన్ మత బోధకురాలు ప్రవీణ్‌షారోన్‌ను పిలిపించి క్రైస్తవ పాటలు, వ్యాఖ్యలు చెప్పించడం చూస్తే బహిరంగంగానే ప్రిన్సిపాల్ క్రిస్టియన్ మతాన్ని పెంచి పోషిస్తున్నారని అర్థమవుతుందన్నారు. ప్రభుత్వ కార్యక్రమంలో అందులో కళాశాలలో ఇలాంటి మత ప్రచారకురాలు వచ్చి బైబిల్ వ్యాఖ్యలు చెప్పడం సరైంది కాదన్నారు. ఉన్నతాధికారులు ప్రిన్సిపాల్, సిబ్బందిని సస్పెండ్ చేయాలని డిమాండ్‌చేశారు.

బిరుదు రామరాజు సేవలు మరువలేనివి



సమావేశంలో పాల్గొన్న కవులు

ఏసీసీ, ఏప్రిల్ 21: తెలుగు సాహిత్యానికి బిరుదు రామరాజు చేసిన సేవలు మరువలేనివని జిల్లా సాహితీ సంరక్షణ సమితి అధ్యక్షుడు దండనాయకుల వామన్‌రావు, కవులు ముత్యబోయిన మలయశ్రీ, అల్లాడి శ్రీనివాస్‌లు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో బిరుదు రామరాజు శతజయంతిని నిర్వహించారు. వారు మాట్లాడుతూ రామరాజు తెలుగు వీరుడు వంటి ఎన్నో పుస్తకాలను రచించారని, తెలుగు సాహిత్యానికి ఎనలేని సేవలందించారని తెలిపారు. కవులు ఉత్తూరి శ్రీలక్ష్మీ, గణపురం సంతోష్, సుగుణాకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అలరించిన చిన్నారుల అడిషన్ షో



విద్యార్థులతో నిర్వాహకులు

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 21: జిల్లా కేంద్రంలోని అభ్యాస పాఠశాలలో ఆదివారం చిల్డ్రన్ అడిషన్ షో అలరించింది. రేడియోజాకీ, యాంకరింగ్, బ్రాడ్ కాస్టింగ్, యూట్యూబ్, పబ్లిక్ స్పీకింగ్, వాయిస్ ఓవర్, డబ్బింగ్, ఇమిటేటింగ్, స్టోరీ టెల్లింగ్, డ్యాన్స్ విభాగాల్లో విద్యార్థులకు ఆడిషన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల నిర్వాహకులు శ్రీకాంత్, రాజులు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. వేసవిలోతీ నైపుణ్య శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రిన్సిపాల్ సాన సుధతి, గిరిష్‌కుమార్, వెంకటేశ్వర్లు, మాధవి, సాగర్, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దుల్లో హై అలర్ట్

- ఎన్నికల నేపథ్యంలో అడుగడుగునా తనిఖీలు
- పక్క రాష్ట్రాల్లో వరుస ఎన్‌కౌంటర్‌లతో ముమ్మర కూంబింగ్



అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్ వద్ద సూచనలు ఇస్తున్న పోలీసు అధికారులు, చెక్‌పోస్ట్ వద్ద తనిఖీలు

కోటపల్లి, ఏప్రిల్ 21: మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో జరుగుతున్న ఎన్‌కౌంటర్ సంఘటన, పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సరిహద్దుల్లో పోలీసులు హైఅలర్ట్ ప్రకటించారు. తీరం వెంట నిరంతర నిఘాను ఏర్పాటు చేసిన పోలీసులు సరిహద్దు ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తెచ్చుకుని ఆయా రాష్ట్రాల నుంచి రాకపోకలను సమీక్షిస్తున్నారు. ఇటీవల బస్తర్ రీజియన్‌లోని కాంకేర్ జిల్లా సరిహద్దులో జరిగిన ఎన్‌కౌంటర్ ఘటనలో 29 మంది మావోయిస్టులు మృతి చెందడంతోపాటు పలువురికి గాయాలయ్యాయి. తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో రోజుకో ఘటన జరుగుతుండడంతో మావోయిస్టులు తెలంగాణలోకి చొరబడే అవకాశాలున్నట్లు నిఘా వర్గాలు హెచ్చరించాయి. దీంతో సరిహద్దు పోలీస్‌స్టేషన్‌లలోని సిబ్బందిని అప్రమత్తం చేశారు. జిల్లా సరిహద్దుల్లోని ప్రాణహిత, గోదావరి పరివాహక ప్రాంతాలతో పాటు అడవుల్లో ప్రత్యేక బలగాలు జల్లెడ పడుతున్నాయి. రామగుండం సీపీతోపాటు మంచిర్యాల డీసీపీ, జైపూర్ ఏసీపీ, ఇతర విభాగాలకు చెందిన ఉన్నతాధికారులు సరిహద్దుల్లోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలను సమీక్షించి సిబ్బందికి సూచనలు చేస్తున్నారు. మావోయిస్టులు తమ ఉనికిని చాటుకునేందుకు ప్రతీకార చర్యలకు ఉపక్రమించే అవకాశాలున్న నేపథ్యంలో వాటిని తిప్పికొట్టేందుకు చెన్నూరు రూరల్ సీఐ సుధాకర్, కోటపల్లి ఎస్ఐ రాజేందర్‌లతో పాటు ప్రత్యేక పోలీసు బలగాలు తీరం వెంట నిత్యం తనిఖీలు చేపడుతున్నారు.

-డ్రోన్‌లతో నిరంతర నిఘా...

సరిహద్దు తీరం వెంట డ్రోన్ల సహాయంతో పోలీసులు నిరంతర నిఘాను ఏర్పాటు చేశారు. ఇప్పటికే సరిహద్దు గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన పోలీసులు వాటితో పాటు అధునాతన సాంకేతికత కలిగిన డ్రోన్‌ల ఆధారంగా మావోయిస్టుల కదలికలపై కన్నేశారు. మరో వైపు పక్క రాష్ట్రాల ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశాలు ఏర్పాటు చేసి ఆ రాష్ట్రాల అధికారుల సమన్వయంతో ముందుకు వెళ్తున్నారు.



ప్రాణహిత తీర ప్రాంత గ్రామాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

-ముమ్మరంగా తనిఖీలు

కోటపల్లి మండలంలోని 63వ నెంబరు జాతీయ రహదారిపై రాపన్‌పల్లి వద్ద అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు సమీపంలో 24 గంటల పాటు వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఎన్నికల్లో ఓటర్లను లోబర్చుకునేందుకు మద్యం, డబ్బులు ఇతర సామగ్రి రాకుండా చూడడంతో పాటు అనుమానిత వ్యక్తుల కదలికలపై నిఘా పెట్టారు. గోదావరి, ప్రాణహిత నదుల మార్గాల్లోని పడవల యజమానులు, మత్స్య కార్మికులతో పలుమార్లు సమావేశాలు ఏర్పాటు చేసి అనుమానిత వ్యక్తులు చొరబడితే తమకు సమాచారం అందించాలని కోరారు. సరిహద్దు తీర ప్రాంత గ్రామాల్లో ఇండ్లలోను తనిఖీలు చేస్తున్న పోలీసులు గ్రామాల్లో కొత్తగా వచ్చిన వ్యక్తుల సమాచారాన్ని రాబడుతున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలని, ప్రజలు సహకారం అందించాలని కోరారు. పక్క రాష్ట్రాల్లో జరుగుతున్న ఎన్‌కౌంటర్‌ల నేపథ్యంలో సరిహద్దులపై హై అలర్ట్ ప్రకటించగా ఎప్పుడు ఏం జరుగుతుందోనని తీర ప్రాంత గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.











ఘనంగా హనుమాన్ భక్తుల శోభాయాత్ర



శోభాయాత్ర చేస్తున్న హనుమాన్ దీక్షాపరులు

బెల్లంపల్లి, ఏప్రిల్ 21 : పట్టణంలోని శంషీర్‌నగర్‌లో గల పంచముఖి ఆంజనేయ స్వామి ఆలయం నుంచి కొత్త బస్టాండ్ మీదుగా కోదండ రామాలయం వరకు ఆదివారం హనుమాన్ భక్తులు శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. హనుమాన్ మాలధారణ భక్తులు భక్తి గీతాలు ఆలపించారు. అనంతరం రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సభ్యులు లక్ష్మణ్‌రావు, ప్రభాకర్‌పటేల్, రాజేష్, గోవర్ధన్, శ్రీరాములు, సంతోష్, శివ, రమేష్, భక్తులు పాల్గొన్నారు.

చెన్నూరు : మండలంలోని కిష్టంపేటలో హనుమాన్ మాల దీక్షాపరులు ఆదివారం శోభాయాత్ర నిర్వహించారు. భజనలు చేస్తూ శోభాయాత్ర నిర్వహించగా హనుమాన్ నామస్మరణతో గ్రామం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

కాలినడకన కొండగట్టు బయలుదేరిన హన్మాన్ భక్తులు

దండేపల్లి, ఏప్రిల్ 21 : దండేపల్లి మండల కేంద్రంతోపాటు పలు గ్రామాలకు చెందిన హనుమాన్ దీక్షాపరులు కొండగట్టు అంజనేయస్వామి దేవాలయానికి ఆదివారం కాలినడకన బయలుదేరారు. మంగళవారం హన్మాన్ జయంతి ఉన్నందున స్థానిక అంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి కొండగట్టుకు బయలుదేరారు.

ఆర్థిక సహాయం

మందమర్రిటౌన్, ఏప్రిల్ 21 : పట్టణంలోని రెండవ జోన్ కటిక దుకాణాల ఏరియాకు చెందిన తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులు హర్తిక్, కార్తీక్‌లకు మందమర్రి వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం రూ. 22 వేల ఆర్థిక సహాయం అందించారు. సభ్యులు ఓ. రాజశేఖర్, బాబురావు, రాజేశంలు మాట్లాడుతూ నాలుగు నెలల వ్యవధిలో తండ్రి ప్రమాదంలో, తల్లి ప్రమాదంలో మృతిచెందడంతో ఏమి తెలియని వయస్సులో చిన్నారుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. వృద్ధాప్యంలో ఉన్న అమ్మమ్మ వద్ద ఉంటున్న చిన్నారుల భవిష్యత్ కోసం ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వాకర్స్ సభ్యులు శ్రీనివాస్, రాజేశం, జాకీర్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

ముత్తారం, ఏప్రిల్ 21 : మంథని-ఓడేడు ప్రధాన రహదారి ముత్తారంలో ఆర్టీసీ బస్సుకు పెను ప్రమాదం తప్పింది. ముత్తారం మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయం సమీపాన ప్రధాన రహదారి పైనే ఇసుక డీడీల కోసం లారీలు రోడ్డుపై నిలిపివేయడంతో ఓడేడు నుంచి గోదావరిఖని వేళుతున్న ఆర్టీసీ బస్సు ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి లారీని ఢీకొట్టాడు. ఆ సమయంలో ఆర్టీసి బస్సు వెనకాల మంది లేకపోవడంతో పాటు రోడ్డుపై ప్రయాణికులు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.











ఇంటింటా బీజేపీ ప్రచారం



ప్రచారం చేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు

నస్పూర్, ఏప్రిల్ 21 : భారతీయ జనతా పార్టీ పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి గెలిపించాలని అంబేద్కర్ కాలనీలో ఆదివారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ ఇంటింటా ప్రచారం చేశారు. కాలనీలో ఇంటింటికి వెళ్ళి ఓటర్లతో మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని విన్నవించారు. మోదీ నాయకత్వంలో దేశంలోని అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. కమలాకర్ రావు, ఆనంద్ కృష్ణ, పానుగంటి మధు, స్వామ్రాజ్ రమేష్, ఈర్ల సదానందం, కుర్ర చక్రి, భీంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

భీమారం: మండలంలోని అంకుశాపూర్‌లో బీజేపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. ప్రధాని మోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ కమలం పువ్వు గుర్తుకు ఓట్లు వేయాలని ప్రజలను కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్, బూత్ అధ్యక్షుడు దుర్గం రాములు, , మండల ఇన్‌చార్జీ బాపు, ప్రధానకార్యదర్శి రాజేష్, నాయకులు శ్రీనివాస్, బాలయ్య పాల్గొన్నారు.

సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా జలీల్

నెన్నెల, ఏప్రిల్ 21: బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా నెన్నెల మండలం కొత్తూరు గ్రామానికి చెందిన మహమ్మద్ జలీల్ నియమితులయ్యారు. కాంగ్రెస్ పార్టీ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీ చేతుల మీదుగా ఆదివారం బెల్లంపల్లిలో నియామక పత్రం అందుకున్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు, పార్లమెంట్ ఎన్నికల మేనిఫెస్టోను సోషల్ మీడియా వేదికగా విశేష ప్రచారం కల్పించి పార్టీ గెలుపునకు కృషి చేస్తానన్నారు.

కోర్టు ఏర్పాటు చేయాలి

మందమర్రిటౌన్, ఏప్రిల్ 21: పట్టణంలోని వెంకటేశ్వర టెంపుల్ ఏరియాలోని సీఐఎస్ఎఫ్ బ్యారెక్‌ను కోర్టుకు కేటాయించారని, ఇందుకోసం సాంకేతిక అనుమతులకు సంబంధించి సహకరించాలని ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామికి ఆదివారం న్యాయవాదులు వినతిపత్రం అందించారు. వెంటనే అనుమతులు వచ్చేలా చూడాలని కోరారు.

వ్యాపారాల కోసమే రాజకీయాల్లోకి కాకా కుటుంబం



బెల్లంపల్లిలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, సీతారాంపల్లిలో మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

బెల్లంపల్లి, ఏప్రిల్ 21: వ్యాపారాల అభివృద్ధి కోసమే కాకా కుటుంబం రాజకీయాలు చేస్తున్నారని పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ఆదివారం పలు వార్డుల్లో మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యతో కలిసి ప్రచారం నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎమ్మెల్యేలు గడ్డం వినోద్, వివేక్‌లు వారి వ్యాపారాలు పెంచుకోవడం కోసమే రాజకీయాలు చేస్తున్నారని, కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీ సైతం వారి బాటలోనే నడుస్తున్నాడని పేర్కొన్నారు. ఎమ్మెల్యే గడ్డం వినోద్ చుట్టుపు చూపుగా బెల్లంపల్లికి వచ్చి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాడని, వారి సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. ఎన్నికల్లో గెలిపిస్తే బెల్లంపల్లిలోనే ఉంటానని వాగ్దానం చేసిన ఎమ్మెల్యే వినోద్ ఒక్క రోజు కూడా బెల్లంపల్లిలో ఉండకపోవడం సిగ్గు చేటన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీలు అమలు కానీ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ప్రజలందరు ఓట్లు వేసి గెలిపించాలని, ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. అనంతరం యువకులను ఓటు వేయాలని వారితో కలిసి క్రికెట్ ఆడారు.

సీతారాంపల్లిలో బీఆర్ఎస్ ప్రచారం

నస్పూర్: నస్పూర్ పట్టణంలోని 20వ వార్డు సీతారాంపల్లిలో ఆదివారం మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలని ఇంటింటా ప్రచారం చేశారు. దివాకర్ రావు మాట్లాడుతూ బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి పనులను చూసి ఎంపీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. అక్కూరి సుబ్బయ్య, పవన్ కుమార్, దెబ్బటి రామన్న, వంగ తిరుపతి, గరిసె రామస్వామి, దర్ని శంకర్, జనార్థన్, రాయలింగు, మల్లికార్జున్, పోశం, రామన్న తదితరులు పాల్గొన్నారు.

బెంగుళూరుకు వెళ్లిన తలసేమియా వ్యాధిగ్రస్తులు



బెంగుళూరుకు వెళ్తున్న తలసేమియా వ్యాధిగ్రస్తులు

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 21 : మంచిర్యాల జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సంకల్ప్ ఫౌండేషన్ బెంగుళూరు వారి సహకారంతో భగవాన్ మహావీర్ జైన్ హాస్పిటల్‌కు బోన్ మ్యారో మార్పిడి నిమిత్తం ముందస్తు వైద్యపరీక్షల కోసం ఆరుగురు తలసేమియా వ్యాధి గ్రస్తులు బెంగుళూరుకు వెళ్లారు. రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ఛైర్మన్ కంకణాల భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ స్వచ్ఛంద సేవా సంస్థల దాతల సహకారంతో బోన్‌మ్యారో మార్పిడి చేయించడం జరుగుతుందని, ఎవరు ఆందోళన చెందవద్దని సూచించారు.

బెంగుళూరుకు రెడ్‌క్రాస్ సొసైటీ సంయుక్త కార్యదర్శి కాసర్ల రంజిత్‌కు మార్‌తో వ్యాధిగ్రస్తులను పంపిస్తామన్నారు. మహేందర్, కాసర్ల శ్రీనివాస్, శంకర్‌వర్మ,మూలకాల సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చేతి పంపునకు మరమ్మతు

కాసిపేట, ఏప్రిల్ 21: దేవాపూర్ పంచాయతీ పరిధిలోని 1వ వార్డులో చేతి పంపు ప్లాట్‌పారం చెడిపోయి మురుగునీరు కలుస్తుంది. దీంతో రోగాల బారిన పడుతున్నామని అధికారులకు చెప్పినా పట్టించుకోకపోవడంతో స్థానిక గిరిజనులు చందాలు వేసుకుని ఆదివారం చేతి పంపునకు మరమ్మతు చేపట్టారు. ఎండాకాలంలో తాగునీటి ఇబ్బందులు పడుతున్నామని, అధికారులు నీటి సమస్య తీర్చాలని కోరారు.

క్రీడాకారులకు ఫుట్‌బాల్స్ పంపిణీ

మందమర్రిటౌన్, ఏప్రిల్ 21: మందమర్రి, మంచిర్యాల, రామకృష్ణపూర్ ఫుట్‌బాల్ క్రీడాకారులకు ఆదివారం మందమర్రిలోని సింగరేణి పాఠశాల మైదానంలో ఎస్‌బీఐ మేనేజర్ సంజయ్‌కుమార్ సాహూ, సీఎం విజయ్‌కుమార్‌లు ఫుట్‌బాల్స్ అందజేశారు. ఫుట్‌బాల్ ఆటలో రాణించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని కోరారు. ఇంటర్నేషనల్ కోచ్ శ్యాం, జిల్లా కోచ్‌లు సురేందర్,కరుణాకర్, శేఖర్,రవి, కృష్ణ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఐఐఎంలో సీటు సాధించిన అంధ విద్యార్థి

మందమర్రిరూరల్, ఏప్రిల్ 21 : అందుగులపేట గ్రామానికి చెందిన ఆకాష్‌రెడ్డి అహ్మదాబాద్‌లో ఐఐఎం కళాశాలలో సీటు సాధించాడు. చిన్నతనంలోనే అంధత్వం వచ్చింది. ఆకాష్‌రెడ్డి తల్లిదండ్రులు శ్యామలమల్లారెడ్డిలు హైద్రాబాద్ బేగంపేట అంధుల పాఠశాలలో పదో తరగతి వరకు చదివించారు. చెన్నైలోని సత్యభామ కళాశాలలో ఇంటర్ చదివాడు. ఇటీవల జరిగిన ఐఐఎం కళాశాలలో ప్రవేశ పరీక్షలో అర్హత సాధించి ఎంబీఏలో సీటు సాధించడంతో పలువురు ఆకాష్‌రెడ్డిని అభినందించారు.

ప్రజా సేవకే రాజకీయాల్లోకి వచ్చాను



ర్యాలీలో పాల్గొన్న గడ్డం వంశీకృష్ణ, నాయకులు

బెల్లంపల్లి, ఏప్రిల్ 21: ప్రజలకు సేవ చేయడానికి రాజకీయాల్లోకి వచ్చానని కాంగ్రెస్ పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ అన్నారు. ఆదివారం రాత్రి పట్టణంలోని 22వ వార్డులో చెన్నూరు, బెల్లంపల్లి ఎమ్మెల్యేలు గడ్డం వివేక్ వెంకటస్వామి, గడ్డం వినోద్‌వెంకటస్వామిలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వంశీకృష్ణ మాట్లాడుతూ ప్రజలందరు తనను ఆదరించి గెలిపిస్తే పార్లమెంట్ పరిధిలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతరం ఎమ్మెల్యేలు మాట్లాడుతూ కాంగ్రెస్ అభ్యర్థి వంశీకృష్ణను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. వంశీకృష్ణ గెలుపు కోసం నాయకులు,కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

24న చేనేని భీమయ్య వర్ధంతి



మాట్లాడుతున్న ఎంపీపీ రొడ్డ లక్ష్మీ

కాసిపేట, ఏప్రిల్ 21: మద్దిమాడలో చేనేని భీమయ్య వర్ధంతిని ఈ నెల 24న నిర్వహించనున్నట్లు ఎంపీపీ రొడ్డ లక్ష్మీ తెలిపారు. ఆదివారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ చేనేని భీమయ్య ఆదివాసీ గిరిజనుల కోసం అటవీ అధికారులతో పోరాడాడని తెలిపారు. పోలీసు కాల్పుల్లో అమరుడైన భీమయ్య వర్ధంతిని నిర్వహిస్తున్నామని తెలిపారు. మాజీ సర్పంచు ఆడె జంగు, నాయకులు కొమ్ముల బాపు, రమేష్, సంద్ర భూమన్న, బద్ది శ్రీనివాస్, మహేందర్, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీనర్సింహస్వామి విగ్రహ ప్రతిష్ఠ



హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

మందమర్రిటౌన్, ఏప్రిల్ 21: పట్టణంలోని ఊరు రామకృష్ణపూర్‌లో ఆదివారం లక్ష్మీనర్సింహస్వామి విగ్రహ ప్రతిష్టాపనను వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే గణపతి, శాంతిపాఠం, చతుష్టానార్చన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రారంభం పూజలను ఘనంగా నిర్వహించారు. వేద పండితులు హోమయజ్ఞాలను నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం



రామకృష్ణాపూర్, ఏప్రిల్ 21: పట్టణంలోని గణేష్‌నగర్‌కు చెందిన శివార్ల సాయమ్మ కేన్సర్‌తో బాధపడుతోంది. విషయం తెలుసుకున్న ఆత్మీయ చారిటబుల్ ట్రస్టు సభ్యులు రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. అధ్యక్షుడు లక్ష్మణ్ మాట్లాడుతూ దాతలు ఉంటే ముందుకు వచ్చి సాయమ్మకు సహకరించాలన్నారు. అధ్యక్షుడు భూమేష్, ఉపాధ్యక్షుడు కుమార్, ట్రెజరరీ టి సురేష్, ప్రచార కార్యదర్శి శరత్‌బాబు, సభ్యులు తిరుపతి, జె శ్రీనివాస్, మహేందర్, మల్లేష్, సంపత్, వెంకటేష్ పాల్గొన్నారు.

ఇసుక లారీ పట్టివేత

చెన్నూరు, ఏప్రిల్ 21: కోటపల్లి మండలం కొల్లూరు ఇసుక క్వారీ నుంచి ఎలాంటి వే బిల్లులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న ఇసుక లారీని చెన్నూరు వద్ద మైనింగ్ అధికారులు పట్టుకున్నారు. ఆదివారం రాత్రి కొల్లూరు ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారనే సమాచారం మేరకు చెన్నూరు వద్ద జాతీయ రహదారి 63పై మాటు వేసి లారీని పట్టుకుని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు మైనింగ్ అధికారి కిరణ్ పేర్కొన్నారు. ఎవరైనా ఎలాంటి వే బిల్లులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

వారసంతలో ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ ఆత్రం సక్కు, ఎమ్మెల్సీ దండే విఠల్

బెజ్జూరు, ఏప్రిల్ 21: మండలకేంద్రంలోని వారసంతలో ఆదివారం బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు, ఎమ్మెల్సీ దండే విఠల్‌తో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో బీఆర్ఎస్‌తోనే ఎంతో అభివృద్ధి జరిగిందన్నారు. కాంగ్రెస్, బీజేపీల మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో నాయకులు చిన్నయ్య, మహేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఊపందుకున్న 'ఉపాధి' పనులు

● పెరుగుతున్న కూలీల సంఖ్య ● నీడ కరువు



బెజ్జూరులో పని చేస్తున్న ఉపాధి కూలీలు

బెజ్జూరు, ఏప్రిల్ 21: పల్లెల్లో వలసలు నివారించి స్థానికంగా పని కల్పించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం జాతీయ ఉపాధిహామీ పథకాన్ని ప్రవేశపెట్టింది. జిల్లాలో గతంలో కూలీల సంఖ్య తగ్గుముఖం పట్టగా ఏప్రిల్ మాసం కావడంతో వీరిసంఖ్య పెరుగుతూ వస్తోంది. ఎండల తీవ్రత కారణంగా ఉదయం సమయంలోనే పనులు చేస్తున్నారు. వారం క్రితం ఉన్న కూలీలసంఖ్య ప్రస్తుతం పెరిగిందని అధికారులు పేర్కొంటున్నారు. రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

చెరువుల్లో పూడికతీత..

ప్రధానంగా చెరువుల్లో పూడికతీత పనులు చేపడుతున్నారు. వచ్చేది వానాకాలం కావడంతో వర్షంనీరు నిల్వఉండేలా చెరువుల్లో చేరిన మట్టిని పంటపొలాలకు తరలిస్తున్నారు. అక్కడక్కడా కందకాల తవ్వకం, భూమి చదును చేయడం, తదితర పనులు చేపడుతున్నారు. ఏప్రిల్ ఒకటి నుంచి ఆర్థిక సంవత్సరం కావడంతో గతంలోనే కొత్తగా పనులు గుర్తించడంతో ప్రస్తుతంఉపాధిపనులు జోరందుకున్నాయి.

ఎండలోనే పనులు..

ఇదివరకు పనిప్రదేశంలో షామియానాలు ఏర్పాటు చేయడంతోపాటు ప్రథమచికిత్స కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచే వారు. ఇప్పుడు ఆ సౌకర్యాలు తొలగించారు. నీటివసతి అంతంత మాత్రంగానే కల్పిస్తున్నారు. ఎండలు తీవ్రంగా ఉండటంతో కూలీలు పని ప్రదేశంలో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. జిల్లాలో జాబ్‌కార్డులు కలిగిన కుటుంబాలు 1,23,423, జాబ్ కార్డులోని సభ్యులు 2,47,870, మహిళలు 1,21,912, పురుషులు 1,28,950, ఉపాధి పనికి హాజరవుతున్న కుటుంబాలు 93,068మంది ఉన్నారు. గ్రామాల్లో పనిచేసే చోట మరిన్ని సౌకర్యాలు కల్పిస్తే మరింత హాజరయ్యే అవకాశం ఉందని కూలీలు పేర్కొంటున్నారు.

ఘనంగా మహావీర్ జయంతి



ఆసిఫాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న మార్వాడీలు, జైన మతస్తులు

ఆసిఫాబాద్, ఏప్రిల్ 21: ఆసిఫాబాద్ పట్టణంలో మహావీర్ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో జైనుల ఆలయంలో జైనులు, మార్వాడీలు ప్రత్యేక పూజలు నిర్వహించి పట్టణంలో పలు వీధులగుండా శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో అజిత్‌లోడ, పారస్ టాటియా, దిలీప్ టాటియా, వినోద్ టాటియా, వైభవ్, మూల్‌చంద్, దర్శన్, మోను, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు



కండువాలు కప్పుతున్న అనీల్‌గౌడ్

తిర్యాణి, ఏప్రిల్ 21: మండలానికి చెందిన పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరడంతో వారికి అనీల్ గౌడ్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్ర మంలో నాయకులు నాందేవ్, జగన్, రాధ, రాంచందర్, జగన్నాథ్‌రావు, దౌవలత్‌రావు, కృష్ణారావు, బల్లార్షా, వెంకటేష్‌గౌడ్, శంకర్, ఎం శంకర్, హరీష్, అమర్, కుమురయ్య, శంకర్, లచన్న, రంజిత్‌గౌడ్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

కడుపునొప్పి భరించలేక యువకుడి ఆత్మహత్య



కిరణ్(ఫైల్)

దహెగాం, ఏప్రిల్ 21: మండలంలోని పెసరికుంట గ్రామానికి చెందిన జుమ్మిడి కిరణ్(27) కడుపునొప్పి భరించలేక ఆదివారం పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై రాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కిరణ్ కొంతకాలంగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. ఆసుపత్రిలో చికిత్స చేయించినా నయం కాలేదు. దీంతో నొప్పి భరించలేక కిరణ్ ఆదివారం పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్ప డినట్లు తెలిపారు. మృతుడి అన్న రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతునన్నట్లు తెలిపారు.

శాంతియుతంగా ఎన్నికలు జరిగేలా సహకరించాలి

● డీఎస్పీ కరుణాకర్



పెంచికలపేటలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

పెంచికలపేట, ఏప్రిల్ 21: పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలు సహకరించాలని డీఎస్పీ కరుణాకర్ అన్నారు. ఆదివారం మండలకేంద్రంలో సీఆర్పీఎఫ్ బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికలు శాంతియుత వాతావరణంలో జరిగేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలమేరకు ఇప్పటి నుంచే సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. కార్యక్రమంలో సీఐ రాంబాబు, ఎస్సై కుమరయ్య పాల్గొన్నారు.

దహెగాం: మండలకేంద్రంలో డీఎస్పీ కరుణాకర్ ఆధ్వర్యంలో సీఆర్పీఎఫ్ పోలీసులు ఆదివారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ప్రజాస్వామ్య పద్ధతిలో, శాంతియుత వాతావరణంలో ప్రజలందరూ తమ ఓటుహక్కు వినియో గించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐ రాంబాబు, ఎస్సై రాజు తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా హనుమాన్ శోభాయాత్ర



శోభాయాత్ర నిర్వహిస్తున్న హనుమాన్ భక్తులు

ఆసిఫాబాద్‌రూరల్, ఏప్రిల్ 21: హనుమజ్జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ వీరాంజనేయస్వామి ఆలయకమిటీ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణ ప్రధాన వీధుల గుండా హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు. ప్రముఖులు, హనుమాన్ దీక్ష స్వాములు, భక్తులు విశేషంగా పాల్గొనగా శోభాయాత్ర కన్నుల పండవగా సాగింది. కేస్లాపూర్ ఆలయంనుంచి స్వామి ఉత్సవవిగ్రహాన్ని పల్లకీలో ఉంచి ఆలయప్రధానార్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆంజనేయస్వామి దీక్షా స్వాములు డీజే నృత్యాలతో శోభాయాత్ర అలరించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు ప్రత్యేకపూజలు నిర్వహించి శోభాయాత్ర ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఎంపీపీ మల్లికార్జున్, నాయకులు వెంకన్న, విశాల్, వెంకన్న, వివేక్, రాధాకృష్ణాచారి, శ్రీనివాస్, మధు, రమేష్, ప్రకాష్‌గౌడ్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా అందవెల్లి బ్రిడ్జి పనులు



పిల్లర్లపై కొనసాగుతున్న స్లాబ్ పనులు

కాగజ్‌నగర్ టౌన్, ఏప్రిల్ 21: కాగజ్‌నగర్ మండలం అందవెల్లి బ్రిడ్జి నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. వంతెన వద్ద నీటి ప్రవాహ వేగం అధికంగా ఉండటంతో ఇంజనీరింగ్ అధికారులు భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని బ్రిడ్జి పొడవు పెంచుతూ ఆరు పిల్లర్లు నిర్మిస్తున్నారు. ఇందుకు రూ.13.64 కోట్లతో పనులు ప్రారంభించారు. పనులను వల్లభనేని కన్‌స్ట్రక్షన్ చేపడుతోంది. ఏడాది నుంచి పనులు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం ఆరు పిల్లర్లపై స్లాబులు వేస్తున్నారు. తర్వాత సైడ్‌వాల్ నిర్మించనున్నారు. పనులను ఆర్అండ్‌బీ డీఈ లక్ష్మీనారాయణ దగ్గరుండి పరిశీలిస్తున్నారు. మరో రెండు నెలల్లో పనులు పూర్తయ్యే అవకాశాలుండడంతో ఈ ప్రాంత ప్రజల కష్టాలు తీరనున్నాయి.

● రెండు నెలల్లో పనులను పూర్తి చేస్తాం..
-లక్ష్మీనారాయణ, డీఈ

అందవెల్లి బ్రిడ్జి నిర్మాణ పనులు శరవేగంగా చేపడుతున్నాం. ప్రస్తుతం ఆరు పిల్లర్ల నిర్మాణం పూర్తి చేశాం. స్లాబ్‌లు పూర్తి చేయాల్సి ఉంది. మరో రెండు నెలల్లో పనులను క్లియర్ చేస్తాం. భారీ వర్షాలు వచ్చినా రాక పోకలకు ఇబ్బందులు ఉండకుండా చర్యలు తీసుకుంటున్నాం.



తుది దశకు చేరుకుంటున్న అందవెల్లి బ్రిడ్జి పనులు





ఉపాధ్యాయుల్లో ఆందోళన

- 'టెట్' అర్హత సాధిస్తేనే పదోన్నతులు
- అది ఇప్పుడు సాధ్యమయ్యే పనికాదు..
- ప్రత్యేక పరీక్ష నిర్వహించాలంటున్న ఉపాధ్యాయులు

బెజ్జూరు, ఏప్రిల్ 21: 'టెట్' పాసైతేనే పదోన్నతులకు అర్హులని ఎన్‌సీటీఈ(నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్) కొత్త నిబంధనలు విధించడంతో ప్రభుత్వ ఉపాధ్యాయులకు టెన్షన్ పట్టుకుంది. ఎప్పుడో ఉద్యోగాలు పొందిన తాము ప్రభుత్వం పదోన్నతులు పొందేందుకు 'టెట్' తప్పనిసరి పాస్ కావాలని నిబంధన పెట్టడం ఏమి టని ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు. టెట్ అర్హత సాధించడం ఇప్పుడు సాధ్యమయ్యే పని కాదని తమ కోసం ప్రత్యేక టెట్ నిర్వహించాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు. కాగా రాష్ట్ర విద్యాశాఖ మాత్రం డీఎడ్, బీఎడ్ అభ్యర్థులతో పాటే ప్రస్తుత ఉపాధ్యాయులు కూడా టెట్ రాయాల్సిందేనని అంటోంది. ఏప్రిల్‌లో టెట్ నిర్వహించిన తర్వాతే ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు ఉంటాయని పేర్కొంటోంది. ప్రభుత్వ నిర్ణయంతో ప్రభుత్వ ఉపాధ్యాయుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది.

'టెట్' నిర్వహణ ఇలా..

టెట్ తొలిసారిగా ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నారు. పూర్తి పేపర్ 150 మార్కులకు ఉంటుంది. ఇందులో అర్హత సాధించాలంటే ఓసీలు 60 శాతం, బీసీలు 50 శాతం, ఎస్సీ, ఎస్టీలు 40శాతం మార్కులు సాధించాల్సి ఉంటుంది. పేపర్-1 ఉత్తీర్ణత కావాలంటే చైల్డ్ డెవలప్‌మెంట్, తెలుగు, ఇంగ్లీష్, గణితం, పర్యావరణానికి సంబంధించిన అంశాలు ఉంటాయి. పేపర్-2లో కూడా ఇదే పరిస్థితి ఉంటుంది. ఈ అంశాలన్నీ చదవడం ఇబ్బందికరమని ఉపాధ్యాయులు అంటున్నారు. ఎప్పుడో ఉద్యోగాలు పొందినవారు ఇప్పుడు టెట్ ఉత్తీర్ణత ఉండాలని చెబుతుండటంతో ఉపాధ్యాయులు ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితుల్లో అవన్నీ తాము చదవలేమని తమకు ప్రత్యేక టెట్ నిర్వహించాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

2009లోనే ఉత్తర్వులు..

ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడే అంటే 2009లోనే ప్రభుత్వం టెట్ ఉత్తర్వులు జారీ చేసింది. 2010లో కొత్తగా డీఎస్సీ రాయాలనుకునే వారికి టెట్ నిర్వహించింది. కానీ ఇన్‌సర్వీసులో ఉన్నవారు కూడా టెట్ రాయాలని చెప్పలేదు. 2013లోను, 2015లోనూ ఉపాధ్యాయులకు పదోన్నతులు చేపట్టింది. ఈ పదోన్నతుల్లో వారికి టెట్ మినహాయించింది. అంతెందుకు ఇటీవల జరిగిన మల్టీజోన్ స్థాయి బదిలీల్లో కూడా టెట్‌కు ప్రాధాన్యత కల్పించలేదు. మల్టీజోన్-1లో జరిగిన బదిలీలు పొందిన వారికి టెట్ అడగలేదు. ఇతర కారణాల చేత మల్టీజోన్-2లో బదిలీలు నిలిచిపోయాయి. ప్రస్తుతం మల్టీజోన్-2లో బదిలీలు పొందే వారు కూడా టెట్ రాయాలని అనడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. జిల్లాలో దాదాపు అన్ని యాజమాన్యాలలో కలిపి రెండువేలకు పైగా టీచర్లు ఉంటే దాదాపు 2000ల మంది టెట్ అర్హత లేని వారే.

హేతుబద్ధత ఏది?

అసలు టెట్ నిర్వహణకు హేతుబద్ధత లేదని ఉపాధ్యాయ సంఘాలు విమర్శిస్తున్నాయి. ఉపాధ్యాయ ఉద్యోగానికి డీఎస్సీ రాస్తే సరిపోతుందని డీఎస్సీకి అర్హులైతే చాలని ఉద్యోగ అర్హతకు డీఎస్సీకి మధ్య ఈ టెట్ హేతురహితమని అంటున్నారు. ఎక్కడా లేని విధంగా ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీల కు రకరకాల మార్కులను నిర్ణయించడం సరికాదని చెబుతున్నారు. కాగా పీఎస్ హెచ్‌ఎంలు ప్రైమ రీ స్కూల్‌లో బోధిస్తారని, విధులు మాత్రం ఎస్జీటీ స్థాయిలో ఉంటాయని అటువంటి వారు లెవల్-1 పరీక్ష రాయా లా?, లెవల్-2 పరీక్ష రాయాలా అనే దానిపై ఇంత వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత రాలేదని అంటున్నారు. పండిట్ టీచర్లు పేపర్-1 కానీ, పేపర్-2కానీ రాయలేరని అన్నారు. ఎందుకంటే వారికి సంబంధిం చిన సిలబస్ ఆ పేపర్లలో ఉండ దని వారికి ప్రత్యేకమైన ప్రశ్నా పత్రం ఉండాలని అలాంటి వారు పదోన్న తులు పొందాలంటే ఎలా అనేదానికి విద్యాశాఖ స్పష్టత ఇవ్వలేదని విమర్శిస్తున్నారు.

'టెట్' నుంచి మినహాయింపు ఇవ్వాలి..

రవికుమార్, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ఆడిట్ కన్వీనర్



ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి. ప్రస్తుతం టెట్‌కు సమాయత్తమవుతున్న వారితో పోటీపడి పరీక్ష రాసే పరిస్థితులు కల్పించొద్దు. టెట్ నిర్వహణ హేత రహితంగా ఉంది. పీఎస్ హెచ్‌ఎంలు, పీజీ హెచ్‌ఎంలు, పండిట్లు ఏ పరీక్ష రాయాలనే దానిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి. తప్పనిసరి పరి స్థితుల్లో నిబంధన అమలు చేస్తే 2010కి ముందు నియామకమైన ఉపా ధ్యాయులకు ప్రత్యేక టెట్ నిర్వహించాలి.

సీఎం సభను విజయవంతం చేయాలి



కార్యకర్తలతో చర్చిస్తున్న కొక్కిరాల విశ్వ ప్రసాద్‌రావ్

జైనూర్ , ఏప్రిల్ 21: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈనెల 22న ఆదిలాబాద్‌లో నిర్వహించే బహిరంగ సభను విజయ వంతం చేయాలని డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్‌రావ్ కోరారు. మండలకేంద్రంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి లక్షలాది మంది తరలివచ్చి సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. అదేవిధంగా కాంగ్రెస్‌పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణక్కను గెలిపించేందుకు కార్యకరక్తలు కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. ఈసారి పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలమధ్యనే ప్రధానపోటీ ఉంటుందన్నారు. సమావేశంలో మండలపార్టీ అధ్యక్షుడు అబ్దుల్ ముకీద్, మునీర్, మాజీ ఎంపీటీసీలు రాథోడ్ రమేష్, షేక్ రషీద్, ఎంపీటీసీ హైమద్‌ఖాన్, నాయకులు భుతాలె వెంకట్‌రావ్, ఖయ్యుం, సుద్దాల ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

సోమినికి బస్సు ప్రారంభం



బస్సును ప్రారంభిస్తున్న ఆర్టీసీ అధికారులు

బెజ్జూరు, ఏప్రిల్ 21: బెజ్జూరు నుంచి సోమినికి ఆదివారం ఆర్టీసీ బస్సు ప్రారంభమైంది. వర్షాకాలంలో బస్సు రద్దు చేసిన అధికారులు ప్రజల విన్నపం మేరకు తిరిగి బస్సును పునరుద్ధరించారు. దీంతో గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో 42.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు

ఆసిఫాబాద్, ఏప్రిల్ 21: జిల్లాలో ఆదివారం42.3డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వాంకిడిలో 42.3డిగ్రీలు, కాగజ్‌నగర్‌లో41.7డిగ్రీలు, ఆసిఫాబాద్‌లో41.2డిగ్రీలు, సిర్పూర్(టి)లో41.1డిగ్రీలు, కెరమెరిలో40డిగ్రీలు, కౌటాలలో 40.2డిగ్రీలు, రెబ్బెనలో40.1డిగ్రీలఉష్ణోగ్రతలు నమోదయినట్లు తెలిపారు.

హనుమాన్ ఆలయంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి పూజలు

జైనూర్, ఏప్రిల్ 21: మండలంలోని ఆశపెల్లిలో నూతనంగా నిర్మించిన హనుమాన్ ఆలయాన్ని ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ జాదవ్ ధురిబాయి, గ్రంథాలయ మాజీచైర్మెన్ కనక యాదవ్‌రావ్, వైస్‌ఎంపీపీ చిర్లే లక్ష్మణ్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు మడావి భీంరావ్ తదితరులు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. గ్రామంలో నిర్వహిం చిన సాముహిక భోజన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం మర్కగూడలో హనుమాన్ దీక్షలు తీసుకున్న స్వాములతో కలిసి ఎమ్మెల్యే హనుమాన్ మందిరంలో పూజలు చేశారు. ఉషేగాం, జైనూరు తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. త్వరలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షుడు ఇంతియాజ్‌లాల, నాయకులు ఆత్రం శంకర్, షేక్ అబ్బు, మాజీ సర్పంచులు కుంరశాంరావ్, మడావిభీంరావ్, జాదవ్ ధరంసింగ్ తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

యువకులకు డీఎస్పీ కౌన్సెలింగ్

ఆసిఫాబాద్ రూరల్, ఏప్రిల్ 21: ఆసిఫాబాద్ పట్టణంలోని పోలీసుస్టేషన్‌లో శనివారం రాత్రి డీఎస్పీ సదయ్య పలువురు యువకులకు కౌన్సిలింగ్ నిర్వహిం చారు. ఈసందర్భంగా డీఎస్పీ సదయ్య మాట్లాడుతూ ఎలాంటి అవసరం లేకున్నా అర్ధరాత్రిళ్ల రోడ్లపై తిరుగడం, నానాహంగామా చేయవద్దన్నారు. వెకిలి చేష్టలకు పాల్పడడం లాంటివి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఇటువంటి వాటిని అరికట్టేందుకు రాత్రి సమయాల్లో పెట్రోలింగ్ చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగ 75మందిని అదుపులోకి తీసుకుని కౌన్సిలింగ్ నిర్వహించారు.



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీఎస్పీ సదయ్య

పీడీఎస్ బియ్యం పట్టివేత

వాంకిడి, ఏప్రిల్ 21: మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయ సమీపంలో శనివారం రాత్రి అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యంను పట్టుకున్నట్లు తహసీల్దార్ రోహిత్ తెలిపారు. బొలేరో వాహనంలో అక్రమంగా బియ్యం తరిస్తున్నట్లు సమాచారం రావడంతో వాహనం తనిఖీ చేయగా అందులో 17.48క్వింటాళ్ల బియ్యం పట్టుపడగా స్వాధీనపర్చుకుని నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

ప్రజలు కేంద్రంలో మళ్లీ మోదీ రావాలని కోరుకుంటున్నారు

- బీజేపీ ఎంపీ అభ్యర్థి జి నగేష్



ఆసిఫాబాద్‌లో మాట్లాడుతున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి నగేష్

ఆసిఫాబాద్/వాంకిడి, ఏప్రిల్ 21: కేంద్రంలో మళ్లీ బీజేపీ ప్రభుత్వం రావాలని ప్రజలు కోరుకుంటున్నారని బీజేపీ ఎంపీ అభ్యర్థి జి నగేష్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం పట్టణంలోని జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు నివాసంతోపాటు వాంకిడిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత దేశం పటిష్టంగా ఉండేందుకు ప్రధాని నరేంద్రమోదీ ఎంతో కృషి చేశారన్నారు. ప్రపంచదేశాల్లో భారత్‌ను అగ్రగామిగా నిలబెట్టారన్నారు. పార్టీలో అరిగెల సోదరులు చేరడంతో పార్టీకి బలం పెరిగిందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, ఎంపీపీ మల్లికార్జున్ యాదవ్, నాయకులు విశాల్, మదనయ్య, ప్రసాద్‌గౌడ్, గణేష్, సురేష్‌యాదవ్, తులసీరాం, తుకారాం, సుచిత్, మురళీధర్ తదితరుల పాల్గొన్నారు.

ప్రజలకు పార్టీకి మధ్య వారధిగా పనిచేయాలి

తిర్యాణి: కార్యకర్తలు ప్రజలకు పార్టీకి మధ్య వారధిగా పనిచేయాలని బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడెం నగేష్ అన్నారు. ఆదివారం మండలంలోని రాళ్లకన్నెపల్లి గ్రామంలో ఎంపీటీసీ రమేష్‌గౌడ్ నివాసంలో బూత్‌స్థాయి నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ హయాంలో చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివ రిస్తూ పార్టీ పటిష్ఠతకు కృషిచేయాలన్నారు. ఎన్నికల్లో పార్టీ గెలుపునకు పని చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు విజయ్, నాగేశ్వర్‌రావు, సొల్లు లక్ష్మి, కిరణ్, వెంకటేష్, సుభాష్, భాస్కర్, తిరుపతి, తులసీరాం తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు

సిర్పూర్(టి), ఏప్రిల్ 21: మండలంలోని రుద్రారం గ్రామంలో అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కన్నుల పండువగా జరిగింది. వేదపండితుల మంత్రోచ్చరణలు, భక్తజన సందోహం మధ్య అయ్యప్పస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠాపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సింగరేణిలో కొత్త గనుల తవ్వకాలు చేపడుతాం

- పదేళ్లలో బీఆర్ఎస్, బీజేపీ కార్మికులకు చేసిందేమి లేదు
- రామగుండం నుంచే కార్మికుల సొంతింటి కల నెరవేరుస్తాం
- రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖమంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

గోదావరిఖని, ఏప్రిల్ 21: సింగరేణిలో త్వరలోనే కొత్తగనుల తవ్వకాలు చేపడుతామని రాష్ట్ర పరిశ్రమల, ఐటీశాఖ మంత్రి దుద్దిళ్లశ్రీధర్‌బాబు అన్నారు. ఆదివారం గోదావరిఖనిలో జరిగిన పెద్దపల్లి పార్లమెంట్ సన్నాహక సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పదేళ్లలో బీఆర్ఎస్, బీజేపీ కార్మికులకు చేసిందేమీ లేదన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించిన పాపానపోలేదని ఆయన విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో డిపెండెంట్ ఉద్యోగాల కోసం లక్షల రూపాయలు కార్మికులనుంచి వసూలుచేశారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత లంచాలు లేకుండా డిపెండెంట్ ఉద్యోగాలు పారదర్శకంగా నిర్వహిస్తున్నట్టుచెప్పారు. వైఎస్ఆర్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో 17000కట్టడాలకు పట్టాలు ఇచ్చామని, మిగిలిన వారికి రామగుండం వేదికగా త్వరలోనే పట్టాలు ఇప్పించనున్నట్టు తెలిపారు. అంతేకాకుండా కార్మికులకు సొంతింటి కలను రామగుండం నుంచే నెరవేర్చనున్నట్టు పేర్కొన్నారు. మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ఆధ్వర్యంలో ఈ రెండు కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు మంత్రి తెలిపారు. సింగరేణిలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించడంతోపాటు ప్రమాదవశాత్తు మృతి చెందిన కాంట్రాక్టు కార్మిక కుటుంబాలకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియాతోపాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇప్పించిన ఘనత కూడా కాంగ్రెస్‌కే దక్కుతుందన్నారు. రాష్టంలో నిరుద్యోగాన్ని రూపు మాపడం కోసం ఐటీ పార్కులను ఏర్పాటు చేసి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్టు చెప్పారు. సింగరేణిలో పదవీ విరమణ పొందిన కార్మికుల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తున్నామన్నారు. వారికి సూపర్ స్పెషాలిటీ వైద్యం అందించేందుకు చర్యలు చేపడుతున్నట్టు చెప్పారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కోల్‌బెల్ట్‌లో ప్రజలు బీఆర్ఎస్ పార్టీకి బుద్ధి చెప్పారని, ఈ ఎన్నికల్లో కూడా బీఆర్ఎస్‌కు బుద్ధి చెప్పాలని ఆయన కోరారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను భారీ మెజార్టీతో కార్మికులు గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి, ప్రభుత్వసలహాదారు హర్కార వేణుగోపాల్ రావు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్‌ఠాకూర్, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్‌రావు, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీ, మేయర్ బంగి అనీల్ కుమార్, ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్, నాయకులు బాబర్ సలీంపాషా, నర్సింహా రెడ్డి, వడ్డేపల్లి దాస్, వికాస్, టైసన్ శ్రీను, వివిధ ఏరియాల ఐఎన్‌టీయూసీ నాయకులు పాల్గొన్నారు.



మెడికల్ బోర్డు నిలిపివేయడం సరికాదు



యూనియన్‌లో చేరుతున్న వారికి కండువాలు కప్పుతున్న రియాజ్ అహ్మద్

మందమర్రిటౌన్, ఏప్రిల్ 21: సింగరేణిలో ఎన్నికల కోడ్‌ను బూచిగా చూపి కార్మికుల మెడికల్ బోర్డు నిలుపుదల చేయడం సరికాదని హెచ్‌ఎంఎస్ ప్రధానకార్యదర్శి రియాజ్ అహ్మద్‌పేర్కొన్నారు. ఆదివారం మందమర్రిలోని హెచ్‌ఎంఎస్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సింగరేణిలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ ఎందుకు నోరుమెదపడం లేదో చెప్పాలన్నారు. తమకు గుర్తింపు పత్రం యాజమాన్యం ఇవ్వడం లేదని ఏఐటీయూసీ నాయకులు చెప్పడం వెనక అసలు కుట్ర వేరే ఉందని, పత్రాన్ని ఎందుకు అడగడం లేదని ప్రశ్నించారు. గుర్తింపు సంఘం ఎన్నికలకు ముందు కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయించాలన్నారు. ఆర్కే1 సీఎస్పీకి చెందిన శ్రీనివాస్ హెచ్‌ఎంఎస్‌లో చేరగా రియాజ్ అహ్మద్ ఆయనకు కండువా కప్పారు. కార్యక్రమంలో ఏరియా ఉపాధ్యక్షుడు రాజిరెడ్డి, బెల్లంపల్లి ఉపాధ్యక్షుడు ఓజియార్, శ్రీరాంపూర్ అధ్యక్షుడు సారయ్య పాల్గొన్నారు.

ఆదాయ పన్ను రద్దు చేయాలి: ఏఐటీయూసీ



సమావేశంలో మాట్లాడుతున్న సీతారామయ్య



సమావేశంలో పాల్గొన్న నాయకులు

శ్రీరాంపూర్, ఏప్రిల్ 21: సింగరేణి ఉద్యోగులు పొందే పెర్క్స్‌పై ఆదాయ పన్ను రద్దుచేయాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) అధ్యక్ష, కార్యదర్శులు వి సీతారామయ్య, కొరిమి రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. కోల్ ఇండియాలో ఈ విధానం కొనసాగుతోందన్నారు. నస్పూర్ కాలనీలోని సింగరేణి గార్డెన్స్‌లో ఏఐటీయూసీ ట్రేడ్ యూనియన్ తరగతులు ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా వారు హాజరై మాట్లాడారు. గత ఆర్థిక సంవత్సరంలో సంస్థ 70మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించినందున ఉద్యోగులకు ప్రోత్సాహకాలు అందించాలన్నారు. దీనివల్ల వారు మరింత ఉత్సాహంగా పనిచేసి సంస్థ అభివృద్ధికి తోడ్పడుతారని అభిప్రాయపడ్డారు. ప్రతి ఏటా ఇవ్వాల్సిన పదోన్నతులను ఎంపీ ఎన్నికలకోడ్ ఉందంటూ నిలిపివేయడం సరికాదన్నారు. సింగరేణి అధికారులను ఎన్నికల విధులకు వినియోగిస్తూ ప్రత్యేకసెలవుల పేరుతో కంపెనీకి నష్టం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డిసెంబర్‌లో సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగినా ఇంతవరకు తమకు గుర్తింపు పత్రం ఇవ్వకపోవడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే గుర్తింపు పత్రం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ ఉప ప్రధానకార్యదర్శులు కె వీర భద్రయ్య, ముష్కె సమ్మయ్య, ఏరియా బ్రాంచ్‌కార్యదర్శి ఎస్‌కె బాజీసైదా, ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు యూసెఫ్, ప్రొఫెసర్ నర్సింహరావు, తదితరులు పాల్గొన్నారు.

గోదావరిఖని తరలిన నాయకులు

మందమర్రిటౌన్, ఏప్రిల్ 21: పట్టణంలో ఆదివారం ఐఎన్‌టీయూసీ నాయకులు ర్యాలీ నిర్వహించారు. ఆదివారం గోదావరిఖనిలో నిర్వహిస్తున్న యూనియన్ మహాసభల సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు దేవి భూమయ్య, జిల్లా అధ్యక్షుడు నరేందర్ మాట్లాడుతూ మహాసభలకు మందమర్రి ఏరియా నుంచి పెద్దసంఖ్యలో తరలి వెళ్తామన్నారు.

అనంతరం ర్యాలీగా గోదావరిఖనిలో జరిగిన సభకు వెళ్లారు. నాయకులు నరేందర్, ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.